నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | గురువారం 7 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## బుగ్గలో ఏర్పాట్లు పరిశీలించిన ఏసీపీ



బుగ్గలో జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లిరూరల్, మార్చి 6 : మహాశివరాత్రి నేపథ్యంలో కన్నాల బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో చేపడుతున్న ఏర్పాట్లను బుధవారం బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గట్టి నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్, తాళ్లగురిజాల ఎస్ఐ నరేశ్, ఏఎస్ఐ రాజన్న ఉన్నారు.

## జిల్లా కోర్టును సందర్శించిన రిటైర్డ్ హైకోర్టు జడ్జిలు



మాట్లాడుతున్న రిటైర్డ్ హై కోర్టు జడ్జి

మంచిర్యాల ఏసీసీ, మార్చి 6 : మంచిర్యాల జిల్లా కోర్టును రిటైర్డ్ హైకోర్టు జడ్జిలు జస్టిస్ నారాయణ, చంద్రయ్య (మాజీ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్) బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జూనియర్ న్యాయవాదులు వృత్తిలో రాణించేందుకు పలు సూచనలు చేశారు. నిరంతరం న్యాయ శాస్త్రాన్ని అభ్యసించడం, చట్టాలపై పూర్తి అవగాహన, పరిజ్ఞానం కలిగి ఉండడం వల్ల వృత్తిలో ఉన్నత స్థానాలకు చేరవచ్చన్నారు. సీనియర్ న్యాయవాదుల నుంచి క్రమ శిక్షణ, నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. మంచిర్యాలలో సొంత కోర్టు భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ జడ్జిలను ఘనంగా సన్మానించారు.

## సహాయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న కలెక్టర్

తాండూర్, మార్చి 6 : జిల్లాలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా పాలన సహాయ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన సహాయ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంతకుముందు నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాల్లో తప్పులుంటే సరిదిద్దడానికి ఇవి ఉపయోగపడుతాయని తెలిపారు. కొత్తగా ప్రజాపాలన దరఖాస్తులు సైతం స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడి వారి దరఖాస్తు వివరాలను ఆయనే స్వయంగా కంప్యూటర్‌లో పొందుపర్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అక్కడి నుంచి మాదారంలోని రేషన్ దుకాణానికి వెళ్లి రికార్డులు పరిశీలించడంతో పాటు బియ్యం నిల్వల వివరాలను సరిచూశారు. కలెక్టర్‌కు స్థానిక ప్రజలు, నాయకులు సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. ఎన్నో ఏళ్ల నుంచి సింగరేణి క్వార్టర్లలో నివసిస్తున్న ప్రజలకు ఇండ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని, ఓపెన్ కాస్ట్‌లో వెలికి తీసే మట్టిని ఊరిలో పోయకుండా చూడాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానన్నారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో, తహసీల్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్
- తాండూర్ ఐబీలో రాస్తారోకో




జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

తాండూర్, మార్చి 6 : పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగాం రాజారాం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తాండూర్ ఐబీలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దాగాం రాజారాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులు రెడ్డి మల్లక్క, బొల్లి సరోజ, దేవ శారద, అన్నక్క, శంకరమ్మ, రాజూబాయి, హనుమక్క, వరలక్ష్మి, సత్యక్క, రాధ, నాయకులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి,నాయకులు

# కాంగ్రెస్‌పై భగ్గుమన్న బీఆర్‌ఎస్


### ఎల్ ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్

- కేటీఆర్ పిలుపు మేరకు పలు చోట్ల ధర్నాలు, రాస్తారోకోలు
- పాల్గొన్న శ్రేణులు



మంచిర్యాలలో నిరసన తెలుపుతూ..

ఆసిఫాబాద్/మంచిర్యాల అర్బన్/చెన్నూర్, మార్చి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై మాట మార్చడంపై బీఆర్ఎస్ పార్టీ భగ్గుమన్నది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేసింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో నిరసనలు చేపట్టింది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహం ముందు శ్రేణులు ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ ప్రజల నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండా ప్లాట్ల రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి '420' హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. మంచిర్యాల పట్టణంలోని ఆర్అండ్‌బీ చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో గెలిచిన తర్వాత మాట మార్చడం సరైంది కాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు ఆనందంగా ఉన్నారని, కాంగ్రెస్ రాగానే నీరు, కరంటు, ఎరువులు అందడం లేదని ఆరోపించారు. చెన్నూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన గిల్డా, చెన్నూర్ ఎంపీపీ మంత్రి బాపు, శ్రేణులతో కలిసి ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



చెన్నూర్‌లో ధర్నా చేస్తూ..

# గుట్టలు కొల్లగొట్టేస్తున్నరు

### ర్యాలీ గఢ్‌పూర్ ప్రాంతాన్ని అడ్డాగా చేసుకొని అక్రమ దందా

- మట్టితో పాటు బండరాళ్ల తరలింపు
- నిత్యం లక్షల్లో సంపాదన
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు



ట్రాక్టర్లలో మట్టి నింపుతున్న పొక్లయినర్



బండను ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్న కూలీలు

మంచిర్యాల అర్బన్, మార్చి 6 : మంచిర్యాల మున్సిపాలిటీలోని రంగపేట శివారులోగల అటవీప్రాంతంలో అక్రమ దందా జోరుగా సాగుతున్నది. కొందరు.. ఏసీసీ ర్యాలీ గఢ్‌పూర్ గుట్టలను అడ్డాగా చేసుకొని మట్టి, బండరాళ్లను తొలగిస్తూ యథేచ్ఛగా తరలిస్తున్నారు. గత నెల 27న 'నమస్తే తెలంగాణ'లో 'రాళ్ల వాగులో దొంగలు' పేరిట కథనం ప్రచురించగా, మకాం మార్చిన అక్రమార్కులు ప్రస్తుతం ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారు.

**సర్కారు ఆదాయానికి గండి..**

జైపూర్ మండలంలో తప్ప.. ఎక్కడా అధికారికంగా మట్టి తీసే క్వారీలేదు. అలాగే రాళ్లకు సంబంధించి జిల్లాలో ఒక్క క్వారీకీ అనుమతి లేదు. దీంతో అక్రమార్కులు అందుబాటులో ఉన్న గుట్టలు, చెరువులు, అటవీ ప్రాంతాల నుంచి గుట్టు చప్పుడు కాకుండా మట్టి తవ్వకాలు, బండరాళ్ల దందా కొనసాగిస్తున్నారు. అధికారులకు ఎంతో కొంత ముట్టచెబుతూ.. లక్షల్లో సంపాదిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంతో గుట్టలు, వాగులు కనుమరుగై పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. ప్రభుత్వ ఆదాయానికీ గండి పడుతున్నది.

**పగలు, రాత్రి తేడా లేకుండా..**

ఆయా ప్రాంతాల నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా పొక్లెయినర్‌ల ద్వారా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. నిన్న మొన్నటి దాకా వాగుల నుంచి మట్టి, బండరాళ్లను తరలించుకుపోయిన వ్యాపారులు.. ఇప్పుడు చడీచప్పుడు కాకుండా అటవీ భూములపై పడ్డారు. ఇదంతా అధికారుల కనుసన్నుల్లోనే జరుగుతున్నట్లు పలువురు బాహాటంగానే మాట్లాడుకోవడం గమనార్హం.

**అనుమతి తప్పనిసరి**



ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాంతాల్లో ఉన్న మట్టి, గ్రానైట్ తీసేందుకు మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతులు తప్పనిసరి. నిర్దేశిత రుసుం చెల్లించిన తర్వాతే తరలింపు చేపట్టాలి. అనుమతులు లేకుండా అక్రమదందా నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. పట్టుబడ్డ వాహనాలు, యంత్రాలను స్వాధీనం చేసుకుంటాం. అక్రమ దందా జరుగుతుంటే పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులకు సమాచారం అందించాలి.

**- బాలు నాయక్, మైనింగ్ ఏడీ, మంచిర్యాల**

# సింగరేణి ప్రగతిలో అధికారులది కీలక పాత్ర



అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

శ్రీరాంపూర్, మార్చి 6 : సింగరేణి ప్రగతిలో కార్మికులతో పాటు అధికారులది కీలక పాత్ర అని, సంస్థ స్థితిగతులను కార్మికులకు వివరిస్తూ సంస్థ పురోభివృద్ధికి మరింత అంకిత భావంతో పనిచేయాలని సీఎండీ ఎన్ బలరామ్ కోరారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సీఎండీని సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకులు బుధవారం కలిశారు. అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరిసింహులు, 12 ఏరియాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సీఎండీని ఘనంగా సన్మానించారు. అనంతరం సమస్యలను ఆయనకు విన్నవించారు. తమ విజ్ఞప్తులపై సీఎండీ బలరామ్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎంవోఏఐ ఉపాధ్యక్షుడు పీ శ్రీనివాస్, రాజీవ్‌కుమార్, సహాయ కార్యదర్శులు ఆర్ కిరణ్‌రాజ్‌కుమార్, రాజగోపాల్, కోశాధికారి నరేశ్, సహాయ కార్యదర్శి బీ రాజగోపాల్, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతితోనే దేశ ప్రగతి

### కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, చిత్రంలో కలెక్టర్ వెంకటేశ్

ఆసిఫాబాద్, మార్చి 6 : మహిళల అభ్యున్నతితోనే దేశం ప్రగతి సాధిస్తుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకలకు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భిక్షపతి, డీఆర్‌డీవో సురేందర్‌తో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ జీడీపీ అభివృద్ధిలో ప్రతిరోజూ మహిళలదే పై చేయి ఉంటుందన్నారు. సమాజ సేవలో మహిళలు ముందుండడం సంతోషంగా ఉందన్నారు. మహిళలతోనే సృష్టి మనుగడ జరుగుతుందని, వివక్షత లేకుండా అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహించాలన్నారు. వారికి సముచిత స్థానం కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయి పదవుల్లో రాణిస్తారని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు జాతీయస్థాయి క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా అధికారులు, ఉద్యోగులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలను సన్మానించారు. అనంతరం రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవోలు, అధికారులు, పాల్గొన్నారు.

**'పది' ఫలితాల్లో ముందంజలో నిలపాలి**

పదో తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలోనే ముందంజలో నిలపాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆర్డీవో లోకేశ్వర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి పోలీసు, విద్యుత్, వైద్య, ఆరోగ్య, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులతో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో 37 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 6,595 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, 37 మంది వివిధ శాఖల అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్, మొబైల్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు సకాలంలో హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళికాబద్ధంగా బస్సులు నడిపించాలని సూచించారు. అత్యవసర వైద్య సేవల కోసం ప్రాథమిక చికిత్స కిట్లతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, చీఫ్ ఇన్విజిలేటర్లు ఒక రోజు ముందుగానే ఇన్విజిలేటర్లకు తగు సూచనలు అందించాలన్నారు. నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి తుకారం భట్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

**గ్రంథాలయ భవనం పూర్తవ్వాలి**

జిల్లా గ్రంథాలయ శాఖ నూతన భవనాన్ని వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో రూ. 1.50 కోట్లతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఈ. శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠకులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పాఠ్యపుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఏఈ. కిరణ్, లైబ్రేరియన్ సదానందం, గుత్తేదార్ అమర్ బీన్ హైమద్, పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన ఉద్యోగినులు